నిషేధించాల్సిందే..!

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రేతలపై జీవీఎంసీ అధికారుల దాడులు
- ఇటీవల 30 కేజీల సరకు స్వాధీనం



దుకాణాలపై జీవీఎంసీ దాడులు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగిస్తున్న దుకాణాలపై జీవీఎంసీ ఇటీవల దాడులు చేపట్టింది. పూర్ణామార్కెట్ హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. ఇటీవల 30 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పట్టుకున్నారు. ఈ నెల చివరి వరకు నిషేధిత ప్లాస్టిక్ పట్టుకుని సీజ్ చేయనున్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి నిషేధిత ప్లాస్టిక్ దొరికితే సీజ్ చేయడమే గాక దుకాణాలు సీజ్, అపరాధ రుసుము విధించనున్నారు. శాఖాపరమైన చర్యలు కూడా చేపట్టనున్నారు.


పూర్ణామార్కెట్‌లోని ఓ దుకాణంలో నిషేధిత ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహిస్తున్న ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, తదితరులు

కఠిన చర్యలు తప్పవు

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తూ దొరికితే కఠిన చర్యలు తప్పవు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ విక్రయించకూడదని ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రజల నుంచి స్పందన వస్తోంది. వ్యాపారులు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు మానుకోవాలి. ఫిబ్రవరి ఒకటి తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు ప్రత్యామ్నాయంగా పేపర్ ప్లేట్లు, గన్నీ బ్యాగ్‌లు, అరటి, చెరకుతో తయారు చేసిన వస్తువులు మాత్రమే విక్రయించాలి.

– కృష్ణంరాజు, ఏఎంహెచ్‌వో, జోన్ – 4

దాబాగార్డెన్స్ : మానవాళికి, పర్యావరణానికి పెనుభూతంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ జోరు పెంచింది. ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ? అంటూ సాక్షిలో రెండు రోజుల కిందట ప్రచురించిన కథనంపై జీవీఎంసీ జోనల్ స్థాయిలో పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టింది. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో పాటు ప్లాస్టిక్ వినియోగిస్తూ, విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానా విధిస్తూ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నెల ఒకటి నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు 120 మైక్రాన్ల లోపు ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ జీవీఎంసీ శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఆదేశాలను అతిక్రమించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన, విక్రయిస్తున్న దుకాణదారుల నుంచి అపరాధ రుసుము వసూలు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న చిన్న వ్యాపారులకు తొలిసారి రూ.2,500, రెండోసారి రూ.5వేల జరిమానా విధించడంతోపాటు ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తున్నారు. జీఎస్టీ పరిధిలో గల పెద్ద వ్యాపారస్తులు మొదటి సారి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, సరఫరా చేసినా, వినియోగించినా, తయారు చేసినా రూ.20 వేలు, రెండో సారి పట్టుబడితే రూ.40వేల అపరాధ రుసుముతోపాటు వారి అన్ని వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతోపాటు కలెక్టర్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. జోనల్ స్థాయి అధికారులతోపాటు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపడతున్నారు.

క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

నిరాశ్రయులకు వసతి


నిరాశ్రయులతో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార : చాలా రోజులుగా స్నానపానాలు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్న ఐదుగురు నిరాశ్రయులను సోమవారం ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో గల షెల్టర్‌కు తరలించారు. విశాఖకు చెందిన బీమరశెట్టి జ్యోతి ప్రకాష్ (56), ప్రతాప్ (45), సాలూరుకు చెందిన అలమండ శంకర్ (42), రాజస్థాన్‌కు చెందిన సికిందర్ (40), పార్వతీపురం ప్రాంతానికి చెందిన గొడ్డి కంచరి కృష్ణను ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో గుర్తించి తరలించారు. వీరికి ఆశ్రయం కల్పించడంతోపాటు ఉపాధి చూపిస్తామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కార్యక్రమంలో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఆశ్రయం


ప్రతాప్

సీతమ్మధార : కుడి చేయి పురుగులు పట్టేసి అత్యంత దుర్భర స్థితిలో తిరుగుతున్న ప్రతాప్ (45) అనే వ్యక్తికి ద్వారకానగర్‌లోని జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. అనంతరం చేతికి ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. శస్త్రచికిత్స చేసి చేయి తొలగిస్తామని వైద్యులు చెప్పారని ఏయూటీడీ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు శ్రీనివాస్, ప్రశాంత్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అల్లిపురం : టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి డీఆర్ఎం కార్యాలయం రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని వయసు 50 సంవత్సరాలు ఉంటాయని, గుర్తించిన వారు టూ టౌన్ సీఐ 94409 04716, 0891 – 2783672లో సంప్రదించాలని కోరారు.

శత జయంతి ఉత్సవాలకు ఆహ్వానం


దత్తేశ్వరానంద భారతీస్వామికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

సీతంపేట : అనకాపల్లిలో గల శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో వచ్చే నెల 4 నుంచి 8 వరకు నిర్వహించనున్న ప్రతిష్ఠ, శత జయంతి మహా కుంభాభిషేక మహోత్సవాలకు శ్రీలలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామికి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం అందజేసింది. సోమవారం పీఠంలో ఉన్న స్వామి వారిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. 8న జరగనున్న మహాకుంభాభిషేకంలో పాల్గొంటానని ఆలయ ప్రతినిధులకు దత్తేశ్వరానంద భారతీ స్వామి తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : ఆంధ్ర రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ నాయకులు జి.అప్పలరాజు, గౌరీష్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా అని విమర్శించారు. ఇది కూడా ప్రైవేటీకరణలో ఒక భాగమే అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేయడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉక్కు కర్మాగారం కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తోందన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు


జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాలలో ఈ నెల 21వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. పుట్టినప్పటి నుంచి ఇంతవరకు ఆధార్ నమోదు కాని పిల్లల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు తమ ఆధార్‌కార్డులతో ఈ సచివాలయాలలో ఉదయం 10.30 గంటలనుంచి సాయంత్రం 4 గంటలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాలని కోరారు.

- తూర్పు నియోజకవర్గ పరిధి 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్–1 నేతాజీ పార్కులో గల 106 సచివాలయంలో, మద్దిలపాలెంలోని 117 సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు.
- ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125 సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలోని 138 సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.
- దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143 నంబర్ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు.

వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఆందోళన


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలో వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు ఆందోళనకు దిగారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ సమస్యలపై కూటమి ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేశామన్నారు. మంత్రిని కూడా కలిసి వినతిపత్రాలు ఇచ్చామని, అయినా స్పందన లేకపోవడంతో ఈ నెల 8 నుంచి దశలవారీగా ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రైతులకు సేవలు అందిస్తున్న తమకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ఏఆర్ ఆంజనేయులు కోరారు. ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, వేతన సవరణ అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.సన్యాసిరావు కోరారు. అనంతరం 14 డిమాండ్స్‌తో వినతి పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యం


సభ్యత్వ కార్డులు ప్రదర్శిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు

మహారాణిపేట : జర్నలిస్టుల సంక్షేమమే వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ లక్ష్యమని యూనియన్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం నియమించిన అన్ని కమిటీల్లోనూ పాత్రికేయులకు ప్రభుత్వం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సభ్యత్వ నమోదు పది రోజులపాటు కొనసాగుతుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జయగోపాల్‌కు పెరియార్ అవార్డు సముచితం


మాట్లాడుతున్న భారత నాస్తిక సమాజం నాయకులు శ్రీరామమూర్తి, నూకరాజు

సీతంపేట : నాస్తికవాది, భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్‌కు మరణానంతరం ప్రముఖ సాంఘిక ఉద్యమకారుడు పెరియార్ అవార్డును ప్రకటించడం సముచితమని భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామమూర్తి, వై.నూకరాజు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నైలోని ద్రవిడ కజగం, పెరియార్ తమిల్ ఫోరం ఈ నెల 15న డాక్టర్ కె.వీరమణి చేతుల మీదుగా పెరియార్ అవార్డు అందజేసినట్టు తెలిపారు. 1972లో డాక్టర్ జయగోపాల్ స్థాపించిన భారత నాస్తిక సమాజం దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో మూఢనమ్మకాల నిర్మూలన, హక్కుల సాధనకై కృషి చేసిందన్నారు.

దళితులపై, స్త్రీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మానవహక్కుల పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా పెరియార్ అవార్డు దక్కిందన్నారు. సీపీఐ నాయకుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ పెరియార్ అవార్డుకు జయగోపాల్ అన్నివిధాలా అర్హుడన్నారు. సమావేశంలో నాస్తిక సమాజం నాయకులు జె.రవి, జె.శ్యామల, జె.సునీత, రాంప్రభు, విజ్ఞానంద్ పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు


హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు

మహారాణిపేట : ముస్లిం తాటిచెట్లపాలెంలో హజరత్ ఖాదర్ వలీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. తొలి రోజు ఫజర్ నమాజ్ అనంతరం ఖురాన్ పఠనం, మగ్రిబ్ నమాజు అనంతరం చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. రెండో రోజు పిల్లలకు ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక వక్త హజరత్ మౌలానా ఒవైస్ రజా ప్రసంగించారు. హజరత్ గరీబ్ నవాజ్ జీవిత చరిత్ర, ఇతరుల పట్ల చూపిన ప్రేమ వివరించారు. గరీబ్ నవాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజానికి మంచి చేయాలని సూచించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖాదర్ వలీ కమిటీ సభ్యులు, మసీదు కమిటీ సభ్యులు ఆధ్యాత్మికవేత్తలను సత్కరించారు.

ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి


జీఎస్‌జే అచ్యుతరావు

అల్లిపురం : విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,500 కోట్లు తాత్కాలిక ఉపశమనమే తప్ప దీర్ఘకాలంలో ప్రయోజనం లేదని ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు అన్నారు. పూర్తి సామర్థ్యంతో మునుపటి వలే ప్రభుత్వ రంగ సంస్థగా మనుగడ సాగించాలంటే సొంత గనులు కేటాయించాలని ఆయన సోమవారం డిమాండ్ చేశారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ప్లాంట్‌లో ఉత్పత్తి మెరుగుపడాలంటే ఖాళీగా ఉన్న 5 వేలు పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహిళపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ – 2 మేరీ ప్రశాంతి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ - 2 మేరీ ప్రశాంతి

మద్దిపాలెం : గత ఏడాది నవంబర్ 29న ఊర్వశి జంక్షన్ దరి ఐటీఐ కూడలి వద్ద ఆర్టీసీ బస్సులో మహిళపై దాడికి పాల్పడింది ఓ యాచకుడని, అలాగే అతడు ఉపయోగించింది యాసిడ్ కాదని బాత్రూమ్‌లు శుభ్రపరిచే (తక్కువ మోతాదులో ఉన్న కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్) రసాయనమని డీసీపీ – 2 మేరీ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆమె వెల్లడించారు. ఐటీఐ జంక్షన్ వద్ద గోపాలపట్నం నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఓ యాచకుడు బస్సు దిగి బయట నుంచి మహిళపై యాసిడ్ పోసి వెళ్లిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందిందని తెలిపారు. మహిళ వెనుక ఉన్న వారిపై కూడా ఆ ద్రావకం చుక్కలు పడినట్టు ఆమె వెల్లడించారు. అయితే అప్పుడు యాసిడ్ దాడి జరిగినట్టు బాధితులు చెప్పడంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పందించి విచారణకు ఆదేశించారని, మొత్తం 21 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామని తెలిపారు. యాసిడ్ దాడి జరిగినట్టు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. అన్ని విధాలుగా విచారించామని, నిందితుడికి, బాధితులకి మధ్య కక్షలు, గొడవలు ఉన్నట్టు కనిపించలేదని ఆమె స్పష్టం చేశారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించామని, సదరు యాచకుడు గోపాలపట్నం ప్రాంతానికి చెందిన వెంకట శ్రీనివాస్‌గా గుర్తించామని తెలిపారు. సదరు యాచకుడు తరచూ 28వ నంబర్ ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తుంటాడని, ఈ క్రమంలో టికెట్ తీసేందుకు నిరాకరిస్తుంటాడని... ఆ క్రమంలోనే బస్సు కండక్టర్, డ్రైవర్ మీద కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్ పోసేందుకు ప్రయత్నిస్తే... అది మహిళపై పడినట్టు అంచనా వేసినట్టు ఆమె తెలిపారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సమావేశంలో ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎస్ఐలు సమీర్, దివ్యభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పైప్‌లైన్లు కలవనీయకండి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు ఇస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


టర్నర్ చౌల్ట్రీ అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

అల్లిపురం : మంచినీటి పైప్‌లైన్లు డ్రైనేజీల్లో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 33వ వార్డు పరిధి నీలమ్మ వేపచెట్టు, వెంకటేశ్వరమెట్ట, గోవింద్ రోడ్డు, కుమ్మరవీధి, టర్నర్ చౌల్ట్రీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి పర్యటించారు. వార్డులో తాగునీటి పైపులైన్ల లీకేజీలు అధికంగా ఉన్నందున అవి భూగర్భ డ్రైనేజీలో కలుస్తున్నాయని, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, డ్రైనేజీలపై కల్వర్టు మరమ్మతులు, కుమ్మరవీధిలోని సచివాలయాన్ని కమ్యూనిటీహాల్‌గా మార్పు చేసే ప్రతిపాదన మొదలైన సమస్యలను కమిషనర్‌కు కార్పొరేటర్ వివరించారు. వీటిపై స్పందించిన కమిషనర్ భూగర్భ డ్రైనేజీలో మంచినీటి పైప్‌లైన్లు కలవకుండా వెంటనే క్షుణ్ణంగా పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. కాలువల్లోని మ్యాన్‌హోల్స్‌లో వ్యర్థాలు వెంటనే తొలగించాలని, కల్వర్టులను సరిచేయాలని, కుమ్మరవీధి సచివాలయాన్ని కమ్యూనిటీ హాల్‌గా మార్చేందుకు పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో పారిశుధ్య కార్మికురాలు తోసుకొస్తున్న పుష్‌కార్టు బరువు పరిశీలించిన ఆయన తేలికపాటి పుష్‌కార్టులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఎంజీఎం హైస్కూల్ పక్కన ప్రతిపాదించిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన టర్నల్ చౌల్ట్రీ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. రోజుకు ఎంత మంది క్యాంటీన్‌ను వినియోగించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్‌కు ఎంత మంది వస్తే అందరికీ భోజనం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోజూ అన్న క్యాంటీన్లను పరిశీలిచాలని ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ డాక్టర్ కృష్ణంరాజును ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.వి.ఎస్.నరేష్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు మురళీకృష్ణ, శ్రీధర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు వెంకటేశ్వరరావు, సహాయ ఇంజినీరు విల్సన్, శానిటరీ సూపర్‌వైజర్ కిషోర్, భీశెట్టి గోపీకృష్ణ పాల్గొన్నారు.

కల్వర్టులపై విరిగిన పలకలతో ప్రమాదాలు


గోవింద్ రోడ్డు వెంకటేశ్వరమెట్ట ఆర్చి వద్ద విరిగిన పలక

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి, గోవింద రోడ్డు, వెంకటేశ్వరమెట్ట ఆర్చి వద్ద కల్వర్టులపై పలకలు విరిగిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే వాటిని మార్పించాలని వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మీరాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం జోన్ – 4 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. తక్షణమే కొత్త పలకలు ఏర్పాటు చేయాలని కోరారు.

మహిళల హక్కులు, లింగవివక్షపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, చిత్రంలో జడ్జి శేషమ్మ.

మహారాణిపేట: మహిళల హక్కుల పరిరక్షణ, లింగ వివక్షపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లకు డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ సోమవారం అవగాహన కల్పించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి ఎం.వెంకట శేషమ్మ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో లీగల్ అవేర్‌నెస్ అంశాలు, పోక్సో చట్టం గురించి వివరించారు. లింగ నిర్ధారణ చేయరాదని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లకు ఆరోగ్య సిబ్బందికి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌పై పీసీపీఎన్‌డీటీ లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం గురించి తెలియజేశారు. నోడల్ అధికారి జి.శారదా దేవి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వర రావు, నోడల్ అధికారి, వివిధ విభాగాల అధికారులు హారిక తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సౌత్ జోన్ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక


క్రీడాకారులతో ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించారు. ఆచార్య ఎస్.విజయ్ మోహన్ మాట్లాడుతూ సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ మహిళా క్రికెట్ పోటీలు ఈ నెల 23 నుంచి 27 వరకు మైసూర్ విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. ఏయూ క్రికెట్ జట్టుకు వివిధ కళాశాలల నుంచి 16 మంది క్రీడాకారిణులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపి, వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జట్టు మేనేజర్, కోచ్‌లుగా ఎస్.కవిత, హారిక వ్యవహరిస్తారన్నారు.